క్లుప్తంగా

మేయర్‌కు సన్మానం



మేయర్ దంపతులకు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలుపుతున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ కాలనీలో గతుకులమయంగా ఉన్న మట్టి రోడ్ల అభివృద్ధికి కృషి చేసిన మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డిని గురువారం వినాయకహిల్స్ కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. ఎన్నో ఏళ్లుగా గతుకులు, పెద్ద గుంతలు పడ్డ మట్టి రోడ్లపై ఇబ్బందులకు గురయ్యామని గుర్తుచేశారు. 5వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏదుల్ల ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.9లక్షలు కేటాయించి బీటీరోడ్డు వేయించినందుకు మేయర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, బాల్‌రాజ్‌యాదవ్, డాక్టర్ రవి, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, పర్వతాలుగౌడ్ తదితరులు ఉన్నారు.

నియామకం



నూతన సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలో కురుమలు గురువారం సమావేశం నిర్వహించుకొని కురుమ పెద్దల సమక్షంలో సంఘం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బడంగ్‌పేట కురుమ సంఘం అధ్యక్షుడిగా గౌర సాయికుమార్, ఉపాధ్యక్షులుగా కడారి భిక్షపతి, కొండ్రు చంద్రయ్య, గౌర రాకేశ్‌కుమార్, గౌర కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా చిన్నరావుల రవీందర్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా దొడ్డి వెంకటేశ్, గౌర శ్రీనివాస్, కోశాధికారిగా గౌర శివకుమార్, గౌరవ సలహాదారులుగా గౌర సత్తయ్య, దొడ్డి మల్లికార్జున్, దడిగ ఐలయ్య, కార్పొరేటర్లుగా గౌర రమాదేవి శ్రీనివాస్, గౌర సురేశ్, కార్యవర్గ సభ్యులుగా దండ్ల మహేందర్, గడిగె రాఘవేంద్ర, కడారి నర్సింహ, గౌర వెంకటేశ్, గౌర కుమార్ తదితరులను ఎన్నుకుని, నియామకపత్రం అందజేశారు.

వేం నరేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



శాలువా కప్పి శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నరేందర్‌రెడ్డి నివాసంలో ఆ దంపతులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, గిరి ముదిరాజ్ ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ హరిపురికాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు. 11కేవీ వాంబేకాలనీ, వీ-గార్డ్, రాక్‌టౌన్, చాణక్యపురి, జీఎస్ఐ, హనుమాన్‌నగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ విజయానగర్ కాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. 11కేవీ రాఘవేంద్రకాలనీ, మదర్‌డెయిరీ, లెక్చరర్స్ కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ కోహెడ, పసుమాముల ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు. 11కేవీ కొత్తపేట, న్యూ మారుతీనగర్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు. 11కేవీ కల్వంచ, చిత్రలేఅవుట్, సాయికాలనీ, విశాలాంధ్ర ప్రెస్, జైపురికాలనీ, రాజీవ్ స్వగృహ ఏ, బీ-బ్లాకుల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కనుల పండువగా మహాపడి పూజ



ఉత్సవ మూర్తిని ఆలయంలోకి తీసకొస్తున్న గురుస్వాములు



పడి వెలిగిస్తూ పదునెట్టాంబడి ఎక్కుతున్న స్వాములు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని బాల మణికంఠ అయ్యప్పస్వామి దేవాలయ పరిసరాలు గురువారం అయ్యప్ప నామస్మరణతో మార్మోగాయి. ఉదయం గణపతి హోమం, 10 గంటలకు మండల మహా పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. శబరిమల సన్నిధాన సహాయ అర్చకుడు బ్రహ్మశ్రీ ఉన్నికృష్ణన్ నంబూద్రీ, ప్రసాద్ గురుస్వాముల పర్యవేక్షణలో ఈ పూజా మహోత్సవాన్ని కొనసాగించారు. మధ్యాహ్నం భక్తుల కోలాహలం మధ్య స్వాములు పడి వెలిగిస్తూ పదునెట్టాంబడితో స్వామివారిని దర్శించుకొని పుష్పాభిషేకం చేశారు. ఆలయ ధర్మకర్త మద్ది జగదీశ్వర్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పడిపూజలో రమేశ్ గురుస్వామి, జగన్మోహన్‌రెడ్డి గురుస్వామి, భాస్కర్‌రెడ్డి గురుస్వామి, రాజశేఖర్ రెడ్డి గురుస్వామి, గుర్జని సుమన్ గౌడ్, కార్పొరేటర్లు సుక్క శివకుమార్, పవన్‌కుమార్ యాదవ్‌లతో పాటు ఎడ్ల కృష్ణారెడ్డి, నిమ్మల నరేందర్‌గౌడ్, వాసుదేవారెడ్డి, కొండల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న భక్తులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు చేస్తున్న విద్యార్థి

మహేశ్వరం: మండల పరిధిలోని మొహబ్బత్‌నగర్ గ్రామ సమీపం శ్రీశైలం జాతీయ రహదారి పక్కన ఉన్న అవేర్ మాధవన్‌జీ కేంద్రంలో యోగా విద్య వికాస కేంద్రం ఆధ్వర్యంలో గురువారం యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. యోగా సాధనతో మానసిక స్థితి మెరుగుపడుతుందన్నారు. శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడడంతో పాటు రక్తపోటు తగ్గుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలని యోగా గురువు మోహన్‌బాబు తెలిపారు. అవేర్ సంస్థలో యోగా విద్య వికాస కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతకుముందు పలువురు యోగా ఆసనాలు చేశారు. ప్రతిభ కనబర్చిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కందడి శ్రీరామ్



కందుకూరు: ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కందుకూరుకు చెందిన కందడి శ్రీరామ్ నియమితులయ్యారు. ఈ నెల 23 నుంచి 25 వరకు సిద్దిపేటలో జరిగిన ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జానారెడ్డి, రాంబాబు ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గురువారం శ్రీరామ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించినందుకు రాష్ట్ర శాఖకు ధన్యవాదాలు తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. విద్యార్థి పరిషత్‌లో పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఆయనకి పలువురు అభినందనలు తెలిపారు.

వైభవంగా క్యాండిల్ సర్వీస్ ఆరాధన



వేడుకల్లో పాల్గొన్న పాస్టర్ మోజెస్ నాయక్

పహాడీషరీఫ్: క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పహాడీషరీఫ్ రంగ నాయకుల కాలనీలోని జేరుషలేం కవనెంట్ చర్చిలో బుధవారం రాత్రి క్యాండిల్ సర్వీస్ ఆరాధన వైభవంగా కొనసాగింది. పాస్టర్ రెవరెండ్ ఎ.మున్నా మోజెస్ నాయక్ సంఘ కాపరిగా స్థానిక నాయకులతో ఆరాధన చేయించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాలు, భాగ్యరావులు ఏసుక్రీస్తు చరిత్రను వివరించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, క్రిష్టియన్ లీడర్ జెరుషలేం మత్తయితో పాటు ఎర్రబాపు ఇశ్రాయేల్ తదితరులు పాల్గొన్నారు.

పాలక మండలి సమావేశం

వనస్థలిపురం: వనస్థలిపురంలోని శ్రీభ్రమరాంభికా సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులు గురువారం సమావేశమై దేవాలయం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రవణ్‌కుమార్, కార్యదర్శి చౌదరి దివాకర్ లింగం, శైలేష్, బాలు మహేంద్ర, సతీష్, మల్లికార్జున్, తీర్థయ్య స్వామి, చంద్రమౌళి, నందీశ్వర్, శ్రీశైలం, మల్లికార్జున్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

హస్తినాపురం: డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. వివిధ కాలనీల్లో జరుగుతున్న పనులను గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఆయా కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములైతే సకాలంలో పూర్తవుతాయన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

ఎల్బీనగర్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఏపీఆర్ క్రిస్టల్ విల్లాస్ వద్ద రోడ్డు మరమ్మతు పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్ వెంట సత్యనారాయణ, శ్యామ్ సుందర్, విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

ఓటమి గెలుపునకు నాంది



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: క్రీడల్లో గెలుపు, ఓటమిలు సర్వ సాధారణమేనని, ఓటమి గెలుపునకు నాందిగా భావించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. చౌదరిగూడలో గత వారం రోజుల క్రితం ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఈ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించాలన్నారు. క్రమశిక్షణ, లక్ష్యం, పట్టుదలతో ముందుకు వెళ్తే క్రీడల్లో రాణిస్తారన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. క్రీడాకారులకు అనుకూలంగా ఉండేందుకు త్వరలో కొందుర్గులో స్టేడియం ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అనంతరం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అర్హులందరూ ఇళ్లు నిర్మించుకునేలా అధికారులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు రాజు, నాయకులు ఆంజనేయులు, పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్, ఎజాజ్‌అలీ, బాల్‌రాజ్, కృష్ణ, సలీం, చంద్రబాబుగౌడ్, నాగరాజు, సత్యనారాయణరెడ్డి, యాదిరెడ్డి పాల్గొన్నారు.

విజేతగా సన్ రైజర్స్ హైద్రాబాద్.

ఈ టోర్నమెంట్‌లో సన్ రైజర్స్ హైద్రాబాద్ జట్టు ఎంతో కృషిచేసి ప్రథమ స్థానం సాధించుకుంది. అదేవిధంగా ఢిల్లీ క్యాపిటల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇక క్రీడాకారుడు ఈశ్వర్‌రావు ఎంతో సంయమనంతో ఆడి బెస్ట్ బ్యాట్స్ మెన్‌తో పాటు మ్యాన్ ఆఫ్ ద సీరీస్ అవార్డు దక్కించుకున్నాడు. అదేవిధంగా బెస్ట్ బౌలర్‌గా జబ్బార్, బెస్ట్ ఫిల్డర్‌గా అజ్మీరీ, బెస్ట్ క్యాచ్‌గా మహేశ్ అవార్డులు అందుకున్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. పట్టణంలోని మరియారాణి పాఠశాల ఆవరణలో నిర్వహించిన 15వ రాష్ట్రస్థాయి జూనియర్ చౌక్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి గురువారం మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారిందరినీ ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తాచాటి జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో అథ్లెటిక్ క్రీడాకారులు శంకర్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, నాయకులు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్

షాబాద్: కార్యకర్తలు పార్టీ బలోపేతం చేసేందుకు సైనికుల్లా పనిచేయాలని పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగర్‌గూడ పీఎస్ఆర్ గార్డెన్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో రైతులు సుభిక్షంగా ఉంటారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రతి నిరుపేదకు అందాలన్నారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరం లాంటిందని, మహిళా సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. త్వరలో మిగిలిన గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ నెల 28వ తేదీన సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్ తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, పీసీసీ కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు మంగలి చెన్నయ్య, నర్సింహులు, మాజీ సర్పంచ్‌లు బండ మహేందర్‌గౌడ్, రవీందర్ ఉన్నారు.

పేదల పక్షాన అలుపెరుగని పోరాటం

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

మహేశ్వరం: సీపీఐ పేదల పక్షాన అలుపెరుగని పోరాటాలు చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటాల్లో సీపీఐ కీలక పాత్ర పోషించిందన్నారు. దున్నేవాడికి భూమి అనే నినాదంతో లక్షలాది మంది పేదలకు భూమి పంపిణీ చేయించిన ఘనత సీపీఐ పార్టీది అన్నారు. భవిష్యత్‌లో పేదల పక్షాన మరిన్ని పోరాటాలను చేస్తామన్నారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దత్తునాయక్, సీపీఐ మండల కార్యదర్శి పల్లాటి యాదయ్య, నాయకులు బ్రహ్మచారి, రాములు, పుష్పమ్మ, నర్సింహ, యాదయ్య పలువురు పాల్గొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న జంగయ్య

ముసురుకున్న వాన

ముసుగేసిన ప్రజలు

ఇబ్రహీంపట్నం: వాతావరణంలో వచ్చిన మార్పులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అసలే చలికాలం.. ఆపై చల్లటి గాలులతో కూడిన చిరు జల్లులు ఏకధాటిగా కురవడంతో ఇంటినుంచి బయటకు రాలేకపోతున్నారు. దీనికి తోడుగా ఉదయం, రాత్రి వేళలో దట్టమైన మంచుపొగ కమ్ముకోవడంతో అత్యవసరమైతే తప్ప.. వెలుపలకు రాలేకపోతున్నారు. వాహనదారులకు ముందు వచ్చే వాహనాలు కనబడక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. బుధవారం తెల్లవారు జాము నుంచి సాయంత్రం 8 గంటల వరకు 2.9 మిమీ వర్షం కురువగా.. గురువారం ఉదయం 8 గంటల వరకు 3.4 మిమీ వర్షపాతం నమోదయింది. ముసురుతో మొదలై.. ఓ మాదిరి వర్షం పడి జనజీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మధ్యాహ్నం కొంత తగ్గినా.. సాయంత్రం నుంచి ముసురు కమ్ముకుంది. మరో మూడు రోజుల పాటు తుపాన్ ప్రభావం ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల అత్యల్పంగా రాత్రి ఉష్ణోగ్రత్తలు ఇబ్రహీంపట్నం ప్రాంతంతో నమోదైన నేపథ్యంలో ఈ ముసురుతో వాతావరణం మరింత చల్లబడే ఆవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా చలికాలంలో వానలు పడటం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది.

పోరాటాలతోనే దోపిడీకి అడ్డుకట్ట



ఇబ్రహీంపట్నం: సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో పార్టీ శ్రేణులు

- పేదలకు అండగా ఎర్రజెండా: సీపీఐ నేతలు
- ఘనంగా పార్టీ శతాబ్ది ఉత్సవాలు

ఇబ్రహీంపట్నం: దేశ స్వాతంత్ర పోరాటంతో పాటు, దోపిడీ దారులకు వ్యతిరేకంగా సీపీఐ ఉద్యమించిందని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. కార్మికులు, పేదల ప్రజల పక్షాన ఎర్రజెండా నిలుస్తుందని, పోరాటాలతోనే దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని వెల్లడించారు. పార్టీ శతాబ్ది ఉత్సవాలను గురువారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు కావలి నర్సింహ్మా.. మండల కేంద్రంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న పార్టీ ఆవిర్భవించిందని, నేటితో వంద సంవత్సరాలు పూర్తిచేసుకుందని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో వేలాది మంది ప్రాణత్యాగం చేసిన చరిత్ర బారత కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సోషలిస్టు కమ్యూనిస్టు భావాలను వ్యాప్తి చేసిందన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని పట్నం ప్రాంతంలో ఇటీవల చేసిన పోరాటాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నర్సింహ్మా, జిల్లా కార్యవర్గ సభ్యురాలు నీలమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లక్ష్మయ్య, బి.నర్సింహ్మా, జె నర్సింహ్మా, శ్రీహరి, ఎల్లయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్‌లో..

సాయుధ పోరాటంలో కీలకం

తుర్కయంజాల్: దేశ స్వాతంత్ర్య, తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు, అనేక కార్మిక, కర్షక ఉద్యమాల్లో సీపీఐ కీలక భూమిక పోషించిందని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య తెలిపారు. పార్టీ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా కౌన్సిల్ సభ్యుడు పి.శివకుమార్ అధ్యక్షతన పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఇందులో నాయకులు శ్రీను, శివ కుమార్, శ్రీకాంత్, విజయ, సుందరమ్మ, భాస్కర్, రాములు, నాగేశ్వర్ ఉన్నారు.

సందడిగా ధ్యాన మహాయాగం



కళాకారిణుల నృత్య ప్రదర్శన

కడ్తాల్: మహేశ్వర మహాపిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగాలు సందడిగా సాగుతున్నాయి. గురువారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి. ధ్యాన గురువు పరిణీత పత్రి మాట్లాడుతూ.. శాఖాహార జగత్తు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇతర జీవులపై ప్రేమ, కరుణతో మెలగాలని సూచించారు. ప్రకృతి సహజ సిద్ధంగా లభించే మొక్కల ఆధారిత ఆహారం తీసుకోవాలన్నారు. ధ్యానం ద్వారా పొందిన జ్ఞానాన్ని దైనందిన జీవితంలో ఆచరించకపోతే ప్రయోజనం శూన్యమని పేర్కొన్నారు. అనంతరం ధ్యాన పుస్తకాలను ఆవిష్కరించారు. ధ్యాన వేదికపై కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ భాస్కర్ ఉన్నారు.



హాజరైన ధ్యానులు